

### జూనోటిక్ వ్యాధులతో జాగ్రత్త

జంతువులు సంక్రమించే వ్యాధుల విషయంలో పశుపోషకులు జాగ్రత్తగా ఉండాలి. శనివారం జూనోసిస్ డే సందర్భంగా పశువైద్యాధికారులు పలు సూచనలు చేశారు. 8లో▸

### జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్



నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ కార్యాలయానికి చేరుకున్న కలెక్టర్‌కు జెడ్పీ సీఈవో గోవింద్, ఇతర అధికారులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /25.5

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంలో అక్కడక్కడ జల్లులు పడే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### పకడ్బందీగా డ్రైడే

- డీఎంహెచ్‌వో ధనరాజ్



నిల్వ నీటిని తొలగిస్తున్న డీఎంహెచ్‌వో

నిర్మల్‌చైన్‌గేట్: వర్షాలు పడుతున్న దృష్ట్యా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, డ్రైడే పకడ్బందీగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ సూచించారు. నిర్మల్ పట్టణంలోని షేక్‌షావ్‌పేట్, గుల్జార్ మార్కెట్, వెంకటాద్రిపేటలో నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమాలను శుక్రవారం పరిశీలించారు. ఇళ్ల పరిసరాల్లో కొబ్బరి చిప్పలు, టైర్లు, పగిలిన కుండలు, రంజన్లు, ప్లాస్టిక్ డబ్బాలు, బాటిళ్లు ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. దోమల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, డిప్యూటీ పారామెడికల్ అధికారి రాజేశ్వర్, ఆరోగ్య పర్యవేక్షకులు భోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పఠనాసక్తి పెంచేలా పుస్తకాలు



బొమ్మ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్/నిర్మల్ రూరల్: బొమ్మల పుస్తకాల వలన విద్యార్థుల్లో పఠనాసక్తి పెరుగుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రూమ్ టు రీడ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో డీకోడబుల్ (బొమ్మల) పుస్తకాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని దాదాపు 9 వేల మంది విద్యార్థులకు బొమ్మల పుస్తకాలు అందించనున్నట్లు తెలిపారు. ఒకటి, రెండవ తరగతిలోని ప్రతీ విద్యార్థికి తెలుగు చదవడం, రాయడం సులభతరం చేయడానికి బొమ్మల పుస్తకాలు దోహదం చేస్తాయన్నారు. పుస్తకాలను ఉచితంగా అందిస్తున్న రూమ్ టూ రీడ్ ఇండియా సంస్థ ప్రతినిధులను అభినందించారు. ఆగస్టులో మండలానికి ఒకటి చెప్పున ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మోడల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, రూమ్ టూ రీడ్ ఇండియా సంస్థ రాష్ట్ర మేనేజర్ నరసింహాచారి, సంస్థ ప్రాజెక్టు అధికారులు నితిన్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, గోనె రవి, అకడమిక్ మానిటరింగ్ అధికారి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కొక్కరుగా..

- బీఆర్‌ఎస్‌ను వీడుతున్న ముఖ్యనేతలు
- తాజాగా ఎమ్మెల్సీ దండే విఠల్ కాంగ్రెస్‌లో చేరిక
- 'గులాబీ' ఆధీనంలో ఇక మూడే మున్సిపాలిటీలు
- ఉమ్మడి జిల్లాలో పట్టుకోల్పోతున్న 'కారు' పార్టీ



దండే విఠల్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/సాక్షి,ఆదిలాబాద్: బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్ గురువారం అర్ధరాత్రి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఎగువ సభలో ఉమ్మడి జిల్లా నుంచి ఆ పార్టీ ప్రాతినిధ్యం కోల్పోయింది. పరిషత్ పాలకవర్గాలు ముగిసిపోవడంతో ఆ పార్టీకి చెందిన జెడ్పీ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు మాజీలయ్యారు. ఒక విధంగా ఈ పదవుల ద్వారా పార్టీ క్షేత్రస్థాయిలో ప్రాతినిధ్యం కనిపిస్తుండగా ఇప్పుడు అవి లేకుండా పోయాయి. ఇక ఉమ్మడి జిల్లాలోని అనేక మున్సిపాలిటీ పాలకవర్గాలు ఇప్పటికే హస్తగతం అయ్యాయి. దీంతో స్థానిక సంస్థల్లో గులాబీ పార్టీ బలహీనపడింది.

**ఎమ్మెల్సీ విఠల్ హస్తం గూటికి..**

ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విఠల్ బీఆర్‌ఎస్‌ను వీడారు. 2022 జనవరి 4 నుంచి ఎమ్మెల్సీగా వ్యవహరిస్తున్న విఠల్ పదవీకాలం ఆరేళ్లు. ఇంకా మూడున్నరేళ్ల గడువు ఉంది. కాగా ఆయన ఎన్నిక చెల్లదంటూ సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి గతంలో హైకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఫోర్జరీ సంతకాలతో తన నామినేషన్‌ను తొలగించారని ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ అనంతరం కోర్టు దండే విఠల్ ఎన్నిక చెల్లదంటూ తీర్పునిచ్చింది. దీనిపై ఎమెల్సీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అది విచారణలో ఉంది. ఈ క్రమంలో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రాజేశ్వర్‌రెడ్డి ప్రస్తుతం కాంగ్రెస్‌లోనే ఉన్నారు. ఈ ఎన్నిక విషయంలో ఏం జరుగుతుందనేది వేచి చూడాల్సిందే.

**మిగిలింది ఇద్దరు ఎమ్మెల్యేలే..**

ప్రస్తుతం బోథ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 11 మున్సిపాలిటీ పాలకవర్గాల్లో ఇప్పుడు కేవలం ఆదిలాబాద్, లక్సెట్టిపేట, చెన్నూర్‌లో మాత్రమే ఆ పార్టీ ప్రాతినిధ్యం ఉంది. భైంసా తప్పితే మిగతా వాటిని కాంగ్రెస్ తన గుప్పిట్లోకి తెచ్చుకుంది. ఆదిలాబాద్, నిర్మల్‌లో బీఆర్‌ఎస్ జెడ్పీచైర్మన్లు ఉండగా ఇక వారు మాజీలు అయిపోయారు. మంచిర్యాలలో జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, ఆసిఫాబాద్ ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. జెడ్పీ పాలకవర్గాల గడువు ముగియడంతో వీటిలోనూ బీఆర్‌ఎస్ ప్రాతినిధ్యం కోల్పోయినట్లయింది.

**నియోజకవర్గాల్లో నేతలు కరువు..**

ఎమ్మెల్సీ విఠల్ హస్తం పార్టీలో చేరడంతో బీఆర్‌ఎస్ కాగజ్‌నగర్ నియోజకవర్గంలో షాక్ తగిలినట్లయింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్‌లో చేరడంతో దండే విఠల్ అక్కడ కీలక నేత ఆయ్యారు. ఇప్పుడు ఆయన కూడా పార్టీ వీడడంతో నాయకత్వం కరవైంది. ఇదివరకే లోకసభ ఎన్నికల ముందు నిర్మల్‌లో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్యేలు ముథోల్‌లో విఠల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ పార్టీ వీడిన విషయం తెలిసిందే. డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి గతంలోనే కాంగ్రెస్‌లో చేరారు. బోథ్‌లో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, ఆసిఫాబాద్‌కు చెందిన ముఖ్యనేత అరిగెల నాగేశ్వర్ కూడా బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఇలా పలు నియోజకవర్గాల్లో ముఖ్య నేతలను పార్టీ కోల్పోయింది.

**నేతల మధ్య సఖ్యత కుదిరేనా?**

స్థానిక నాయకులకు ఇష్టం లేకున్నా బీఆర్‌ఎస్ నుంచి ఇప్పటికే మాజీ మంత్రి ఐకేరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రేఖానాయక్, రాథోడ్ బాపూరావు, కోనేరు కోనప్ప, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా పార్టీ మారిన ఎమ్మెల్సీ దండే విఠల్ సొంత నియోజకవర్గం సిర్పూర్ కాగా ఇప్పటికే అక్కడ బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేరారు. అక్కడ రావి శ్రీనివాస్ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నారు. విఠల్ రాకతో స్థానికంగా మూడు వర్గాలుగా పార్టీ ఉండనుంది. దీంతో కొత్త, పాత నాయకుల మధ్య సఖ్యత కుదురుతుందా అనే చర్చ నడుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో సమన్వయం కొరవడి పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ ఓడిపోయారనే వాదనలు ఉన్నాయి. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కేడర్ బలంగా ఉండి కూడా అసెంబ్లీ ఎన్నికల్లో సీటు కోల్పోవాల్సి వచ్చింది. నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల పరిధిలోని ఆయా సెగ్మెంట్లలో అధికార పార్టీలో కొత్త, పాత నాయకుల మధ్య వర్గపోరు మొదలైంది. ఈ క్రమంలో నామినేటెడ్ పదవులు, సంస్థల ఎన్నికల్లో టికెట్ల కేటాయింపులు నాయకుల మధ్య చిచ్చుపెట్టే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు పార్టీ మారిన నాయకులు నామినేటెడ్ పోస్టుల్లో తమకు అవకాశమివ్వాలని కోరుతున్నారు. కొత్తవారితో ఏళ్లుగా జెండా మోస్తున్న వారికి నష్టం జరుగుతుందని సీనియర్లు పేర్కొంటున్నారు.

**అభివృద్ధి కోసమే..**

జిల్లాలో అభివృద్ధి పనుల కోసమే అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ భాగస్వామ్యంలో ఉమ్మడి జిల్లా అభివృద్ధికి దోహదపడతాను.
– దండే విఠల్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ

## విద్యార్థులకు అథ్లెటిక్స్‌లో పోటీలు



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

నిర్మల్ రూరల్: తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్– 8, 10, 12 విభాగాల్లో బాల బాలికలకు శుక్రవారం రన్నింగ్, జంపింగ్ పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన పోటీల్ల జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డీవైఎస్‌వో శ్రీనివాస్ మాట్లాడుతూ.. చిన్న వయసు నుంచి ఆటల్లో శిక్షణ పొందితే మంచి ఫలితాలు పొందుతారన్నారు. జిల్లాస్థాయిలో విజేతలను హైదరాబాద్ గచ్చిబౌలిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీవైఎస్‌వోను అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఇందులో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మనాభంగౌడ్, శామ్యూల్, వ్యాయామ ఉపాధ్యాయులు సత్తయ్య, పెంటన్న, గిరిప్రసాద్, సునీల్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు గనుల వేలం ఆపాలని ధర్నా



నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణలో బొగ్గు గనుల వేలం ఆపాలని వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్వోకు మెమొరాండం అందించారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. కేంద్రంలో మూడవసారి అధికారం చేపట్టిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం బొగ్గు గనులు వేలం వేసి కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహించి ప్రభుత్వరంగ సంస్థ సింగరేణిని మూసివేయలని చూస్తోందని ఆరోపించారు. తెలంగాణలో ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాదిమందికి ఉపాధిని కల్పిస్తుందన్నారు. రాష్ట్రానికి చెందిన కిషన్‌రెడ్డికి గనుల శాఖను అప్పజెప్పి అధికారంలోకి రాగానే మొదటి ఇలా కార్మికులు బలిపెట్టే నిర్ణయాలు తీసుకోవడాన్ని తప్పు పట్టారు. మానిటైజేషన్ పేరుతో ప్రైవేటీకరణ దిశగా 2025 వరకు రూ.28,745 కోట్లు సంపాదించుకునే దిశగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం వెనక్కి తీసుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు ఎస్ఎన్.రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జే.రాజు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న, జిల్లా కార్యదర్శి హరిత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్, ఏఐటీయూసీ జిల్లా సహకార దర్శి భూక్య రమేశ్, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె లక్ష్మి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేల్లి నర్సయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న, ఎండీ.గఫూర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దిగంబర్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తోడసం శంభు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బర్కుంట గంగారాం పాల్గొన్నారు.

## అనుమతి లేని నిర్మాణాల తొలగింపు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం ఎదుట అక్రమంగా నిర్మించిన దుకాణాలను మున్సిపల్ అధికారులు శుక్రవారం తొలగించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టొద్దని సూచించారు. అక్రమంగా నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మధ్యాహ్న భోజనంపై శ్రద్ధ వహించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో

మామడ: పాఠశాలలలో మధ్యాహ్న భోజనం నిర్వహణపై శ్రద్ధ వహించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం తయారీని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. భోజనం తయారు చేసే పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. డీఈవో వెంట హెచ్ఎం అరవింద్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## నేడు టీశాట్‌లో ఇన్‌స్పైర్‌పై అవగాహన

నిర్మల్ రూరల్: టీశాట్ (నిపుణ చానెల్)లో ఇన్‌స్పైర్ అవార్డ్స్ నామినేషన్ కోసం శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రసారమయ్యే కార్యక్రమాన్ని 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులందరూ తప్పక చూడాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ అవార్డ్స్ నామినేషన్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. భౌతిక, గణిత, జీవశాస్త్ర ఉపాధ్యాయులు తప్పకుండా పాల్గొనాలని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్ 9440069830ను సంప్రదించాలని సూచించారు.

# ట్రాఫిక్ ఉల్లం'ఘనుల'పై కొరడా

- ప్రత్యేక దృష్టిసారించిన జిల్లా పోలీసులు
- మైనర్ల డ్రైవింగ్‌పై నజర్
- జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు..



కారు తనిఖీ చేస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ప్రమాదాలు ఆగడం లేదు. మద్యం మత్తు, అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడం.. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వడం వలన కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసులు ట్రాఫిక్ రూల్స్‌ను కఠినతరం చేశారు. కొత్త చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసేందుకు సిద్ధమయ్యారు. ట్రాఫిక్ ఉల్లంఘనులకు భారీగా జరిమానాలు, శిక్ష విధించేలా చర్యలు తీసుకుంటున్నారు.

**మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి**

గతంలో మైనర్లు డ్రైవింగ్ చేస్తూ.. పోలీస్ వారికి పట్టుబడితే జరిమానా వేసి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేవారు. ఇక నుంచి మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టపడితే వాహనాలు సీజ్ చేసి, వారితోపాటు వారి తల్లిదండ్రులు లేదా వాహన యజమానిని న్యాయస్థానంలో హాజరుపరుస్తారు. తద్వారా న్యాయస్థానం శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా డ్రైవింగ్, రోడ్డు ట్రాఫిక్ నిబంధనలు గురించి అన్ని పాఠశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. విద్యార్థి దశనుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగేలా జిల్లా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

**సౌండ్ మారితే సైలెన్సర్ గోవిందా..**

కొందరు యువకులు ద్విచక్ర వాహనాలకు కంపెనీ ఇచ్చిన సైలెన్సర్లు మార్చి, అధిక శబ్దం వచ్చే వాటిని అమరుస్తున్నారు. దీంతో రోడ్లపై వెళ్లే పాదచారులు, మిగతా వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అటువంటి వారి ఆటకట్టించడంపై జిల్లా పోలీసులు దృష్టి పెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. నిబంధనలు అతిక్రమించి తరచూ.. ఇలాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేయనున్నారు. అదేవిధంగా లైసెన్స్, నంబర్ ప్లేట్, నంబర్ ట్యాంపరింగ్, నంబర్ చెరిపేసిన వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు.

**మైనర్, రాష్ డ్రైవింగ్‌పై నిఘా..**



ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగింది. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాం. ప్రత్యేకంగా మైనర్, రాష్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాం. రోడ్డు ప్రమాదాలకు మద్యం మత్తు, రాష్ డ్రైవింగ్ ప్రధాన కారణం. మైనర్లు బైక్‌లు, కార్లు నడుపుతూ.. ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇన్సూరెన్స్ లేని వాహనాలతో జరిగే ప్రమాదాలలో ఎవరైనా చనిపోతే వారి కుటుంబానికి ఎలాంటి ఆర్థిక సాయం అందదు.
– జానకీషర్మిల, ఎస్పీ

**ఈ ఏడాది జనవరి 1 నుంచి నమోదైన కేసుల వివరాలు**

- కాంటాక్ట్ కేసులు: 17,628, జరిమానా రూ.41,33,700
- నాన్ కాంటాక్ట్ /కెమెరా కేసులు: 74,180, జరిమానా రూ.1,77,27,100
- లేజర్ గన్ కేసులు: 7,119, జరిమానా రూ.73,44,565
- ఓవర్ స్పీడ్ కేసులు 7,169, జరిమానా రూ.7,16,9000
- డ్రంకెన్‌డ్రైవ్ కేసులు : 2,385
- మైనర్ డ్రైవింగ్ కేసులు : 49, జరిమానా రూ.24,500
- సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ కేసులు : 1,489, జరిమానా రూ.14,89,000.
- సిగ్నల్ జంపింగ్ కేసులు 27, జరిమానా రూ.27,000
- హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపిన కేసులు : 77,076, జరిమానా 1,13,03,100.
- రాంగ్ సైడ్ డ్రైవింగ్ కేసులు : 456, జరిమానా రూ.1,03,200
- ట్రిపుల్ రైడింగ్ కేసులు: 2,164 కేసులు, జరిమానా రూ.25,96,800
- విపరీతమైన శబ్దాల చేస్తూ తిరిగే 80 వాహనాల సైలెన్సర్స్ తొలగించారు.
- నంబర్ ప్లేట్ సరిగా లేని 490 వాహనాలకు రూ.98,000 జరిమానా విధించారు.




## క్లుప్తంగా

### పొక్లెయిన్ పట్టివేత



పట్టుకున్న జేసీబీతో అధికారులు

ఇచ్చోడ: మండలంలో మాదపూర్ వద్ద అక్రమంగా మొరం తవ్వుతున్న పొక్లెయిన్‌ను శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు పట్టుకున్నారు. సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లగా ప్రభుత్వ స్థలంలో అక్రమంగా మొరం తవ్వుతున్న పొక్లెయిన్‌ను పట్టుకుని యజమానికి రూ.25 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాల్లో మొరం తవ్వకాలు జరపవద్దన్నారు. ఆయన వెంట రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### బైక్ చోరీ నిందితుడి రిమాండ్

పెంబి: బైక్ చోరీ నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జేఎల్ఎం ఫయాజ్ బైక్ మంగళవారం రాత్రి చోరీకి గురైంది. దీంతో బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, నాగాపూర్ గ్రామంలో పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో లోతర్యతండా గ్రామ పరిధిలోని గట్టుగూడెం గ్రామానికి చెందిన కర్రె రాజేందర్ అదే బైక్‌పై కనిపించగా పట్టుకున్నారు. బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని గురువారం రాత్రి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చి అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

### విద్యుదాఘాతంతో ఒకరు మృతి

నార్నూర్: మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి చెందిన జాదవ్ హేమంతరావు (45) శుక్రవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఎస్సై మహేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగలకొండ గ్రామానికి చెందిన కాలురాం పంటను కాపాడుకునేందుకు అడవి జంతువుల రక్షణ కోసం కంచె ఏర్పాటు చేసి దానికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడు. శుక్రవారం ఉదయం జాదవ్ హేమంతరావు రోజులాగే బహిర్భూమికి వెళ్లేందుకు కంచె దాటే యత్నం చేశాడు. ఈక్రమంలో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య భారతి, ఇద్దరు కుమార్తెలున్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న పార్థసారథి

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన ఇద్దరు హాకీ క్రీడాకారులు సౌత్ జోన్ నేషనల్ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి తెలిపారు. శుక్రవారం పోటీలకు బయలుదేరిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని పులివెందులలో ఈనెల 11నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఉట్నూర్ ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన శేఖర్ వీరికి కోచ్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సౌత్ జోన్ పోటీలకు ఇద్దరు క్రీడాకారులు ఎంపిక కావడంపై ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, ఖేలో ఇండియా హాకీ కోచ్ శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

# జూనోటిక్ వ్యాధులతో జాగ్రత్త

- పెంపుడు కుక్కలతో జర భద్రం
- పరిశుభ్రతతో వ్యాధులు దూరం
- రేబిస్ నివారణ టీకా తప్పనిసరి
- నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం



లాబ్రడార్ జాతి పెంపుడు కుక్క

**పెంపుడు జంతువుల వివరాలు**

**ఆదిలాబాద్ జిల్లా**

| | |
|---|---|
| గేదెలు | 48,650 |
| ఆవులు | 3,11,182 |
| గొర్రెలు | 1,53,214 |
| మేకలు | 1,86,469 |
| పందులు | 1,890 |
| కుక్కలు | 5,267 |
| కుందేళ్లు | 70 |
| కోళ్లు | 5,47,969 |
| పక్షులు | 5789 |

**కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా**

| | |
|---|---|
| గేదెలు | 49,445 |
| గొర్రెలు | 1,60,958 |
| మేకలు | 2,59,539 |
| ఆవులు, ఎద్దులు | 26,451 |

నిర్మల్‌ఖిల్లా/కైలాస్‌నగర్/ఆసిఫాబాద్ అర్బన్/మంచిర్యాల అగ్రికల్చర్: కుక్కలు, పశువులు, ఇతర జంతువులు, కోళ్లు, పక్షుల నుంచి సంక్రమించే జూనోటిక్ వ్యాధుల విషయంలో పశుపోషకులు, జంతుప్రేమికులు జాగ్రత్తగా ఉండాలి. పశువులు, వాటి పాకల అపరిశుభ్రత, తదితర కారణాలతో సుమారు 200 రకాల వ్యాధులు సోకే అవకాశముంది. వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తం చేయాల్సిన, వ్యాధులపై విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరముంది. శనివారం జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా పశు వైద్య, పశుసంవర్ధకశాఖ అధికారి ఈ శంకర్ పలు సూచనలు చేశారు. పెంపుడు కుక్కలు, ఇతర జంతువుల యజమానులు రేబిస్ నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. పశువైద్యశాలల్లో రేబీస్ నివారణ టీకాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రేబిస్ సోకిన వీధికుక్కలు కరిస్తే పాడిపశువులు మృత్యువాత పడే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

**జూన్ 6న ఎందుకంటే..**

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను నివారించేందుకు కొన్ని సంవత్సరాలుగా టీకాలతో బ్రిటిష్ దేశ శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేశారు. 1885 జూలై 6వ తేదీన లూయిస్ ప్యాచర్ అనే శాస్త్రవేత్త మొట్టమొదటిసారిగా పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడికి వ్యాధి నిరోధక టీకా ఇచ్చారు. ఆ ప్రయత్నం విజయవంతం కావడంతో జూలై 6వ తేదీని ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా పాటిస్తూ వస్తున్నారు.

**ఎక్కువగా సంక్రమించే వ్యాధులు..**

పశువుల కాపరులు, పశు వైద్యవృత్తిలో ఉన్నవారు, జంతు ప్రేమికులు, సరదా కోసం కుక్కలు, పక్షుల్ని పెంచేవారు, పశువుల డెయిరీఫాంలలో పని చేసేవారు, పాలు, పాల ఉత్పత్తుల్ని ఆహారంగా తీసుకునే వారు, మాంసాహారులు.. వీరంతా

**పశువులకు రేబిస్ సంక్రమణ ఇలా..**

పశువులను పిచ్చికుక్కలు కరవడం ద్వారానే ఎక్కువగా రేబిస్ సంక్రమిస్తుంది. వైరస్‌తో కలుషితమైన పిచ్చికుక్క చొంగ పశువుల గాయాలు, పుండ్లకు అంటుకున్నా ఈ వ్యాధి సోకుతుంది. రేబిస్ ఎక్కువగా కుక్కల ద్వారా, ఆ తర్వాత పిల్లులు, ముంగీసలు, నక్కలు, తోడేళ్లు తదితర జంతువుల ద్వారా చిట్టెలుక నుంచి ఏనుగు వరకు అన్ని క్షీరదాలకు సోకుతుంది. ఎక్కువగా పశువుల కేంద్రనాడీ మండలాన్ని ఆశించి వ్యాధిగ్రస్తం చేయడంతో చివరగా పశువుల్లో పక్షవాతం వస్తుంది. తదనంతరం అవి మరణిస్తాయి. కుక్క కరిచిన తర్వాత వ్యాధి లక్షణాలు 2 నుంచి 3 వారాల తర్వాత కనబడతాయి. ఒక్కోసారి 5 నుంచి 6 నెలల తర్వాత కూడా బయటపడతాయి. మెడకు దగ్గరగా ఉన్న ముఖం, మెడ ప్రాంతాల్లో కరిస్తే వ్యాధి లక్షణాలు త్వరగా కనబడతాయి.

**అంత్రాక్స్, బ్రూసెల్లోసిస్..**

పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులు అనేకం. దొమ్మ (అంత్రాక్స్) మటన్ కొట్టేవారికి, గొర్రెలు, మేకలు, పశువులు చనిపోతే చర్మకోసం వాటిని కోసేవారికి ఈ వ్యాధి సోకే ప్రమాదముంది. కొమ్ములు, చర్మం, ఎముకలతో సంబంధమున్న పరిశ్రమల్లో పని చేసే వారికీ ఈ వ్యాధి రావచ్చు. మరో వ్యాధి బ్రూసెల్లోసిస్. ఇది డెయిరీ ఫాంలలో పని చేసే వారికి, పశువైద్యులకు సోకే అవకాశముంది. వ్యాధి సోకిన వారికి నపుంసకత్వం రావచ్చు. వ్యాధి సోకిన పశువుల గర్భకోశం నుంచి సంక్రమించే ద్రవం, చీము, వీర్యం ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. గర్భస్రావం జరిగిన పశువుల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించి, సరిగా వైద్యం చేయిస్తే ఈ వ్యాధిని అరికట్టవచ్చు. వ్యాధి నివారణకు టీకాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

జూనోటిక్ వ్యాధుల విషయంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. పెంపుడు కుక్కల్ని శాస్త్రీయ పద్ధతిలో, పశువైద్యుని సలహాల మేరకు అన్ని జాగ్రత్తలతో పెంచకుంటే వాటి నుంచి సంక్రమించే వ్యాధులు ప్రాణాంతకంగా పరిణమిస్తాయి. జూనోటిక్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే శుచి, శుభ్రత పాటించడం చాలా అవసరం.

**పెంపుడు కుక్కలకు టీకాలు..**

సకాలంలో రేబిస్ నివారణ టీకాలు వేయిస్తే యజమానులు, కుటుంబ సభ్యులతోపాటు సమీప నివాసాలవారు, పశువులు, కుక్కల్ని రేబిస్ కంబంధహస్తాల నుంచి రక్షించిన వారవుతారు. ఇంట్లో పెంచే పెంపుడు కుక్కలకు మొదటిసారి 30వ రోజు, బూస్టర్ డోసు 90 రోజులకు, దీంతో పాటు ఏటా 'రేబిస్' నివారణ టీకాలు వేయించాలి. కుక్కలతో సన్నిహితంగా ఉండేవారు రేబిస్ సోకకుండా వ్యాధి నివారణ టీకాలు వేయిస్తూ ఉండాలి.

**కలుషితమైన పాలతో క్షయ**

కలుషితమైన పాలు తాగితే క్షయ సోకుతుంది. దీని బారిన పడకుండా ఉండాలంటే పచ్చిపాలు తాగకూడదు. బాగా మరగకాచి, చల్లార్చిన పాలనే తాగాలి.

**పిచ్చికుక్క కాటుతో రేబిస్..**

పిచ్చి కుక్క కాటుతో పశువులు, కుక్క కరిచిన మనుషులకు రేబిస్ సోకుతుంది. ఇది ప్రాణాంతకమైంది. పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా ప్రతీ సంవత్సరం యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) ఇప్పిస్తే వ్యాధిని అరికట్టవచ్చు. కుక్కల ద్వారా గజ్జి లాంటి చర్మ వ్యాధులు కూడా వ్యాప్తి చెందుతాయి. పిచ్చికుక్క కాటుతో పశువులు, మనుషుల్లోనూ సోకే అతి ప్రమాదకరమైన వ్యాధి రేబిస్. ఇది రోబ్డోవైరస్ క్రిములతో సంభవిస్తుంది. ఈ వ్యాధి సోకితే మృత్యుముఖం నుంచి బయటపడడం అసాధ్యం. ఊరకుక్కలు అధికంగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా పశువులు, మనుషులు పిచ్చికుక్కల కాటుకు గురవుతూ ఉండగా మరణాలు సంభవిస్తున్నాయి.



ఇక ఎలుకలు ఎక్కువగా తిరిగే ధాన్యం గిడ్డంగుల్లో పని చేసే వారికి లెప్టోస్పైరోసిస్ సోకుతుంది.

**ఈ వ్యాధులు కూడా..**

హైడాటిసిస్, ఎకైనోకోకస్ (అంతర్గత పరాన్నజీవులు) కారణంగా కూడా మనుషులకు జూనోటిక్ వ్యాధులు సోకుతాయి. పశువులు, కుక్కల శరీరంలో ఉండే బద్దె పురుగులు గుడ్లు పెడతాయి. అవి కుక్కలు, పశువుల శరీరంలోని వివిధ భాగాల్లో ఉండిపోతాయి. అలాంటి పశువుల మాంసాన్ని సరిగా ఉడికించకుండా తింటే బద్దె పురుగుల గుడ్లు మనుషుల శరీరంలోకి ప్రవేశించి అనారోగ్యాన్ని కలుగజేస్తాయి. మాంసాన్ని సరిగా ఉడికించి తిన్నట్లయితే వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ఇక కోళ్ల ఫాంలలో పని చేసే వారికి, సరిగా ఉడికించని గుడ్లు, మాంసం తిన్నవారికి సాల్మోనుల్లోసిస్ సోకుతుంది. కుళ్లిన ఆహార పదార్థాలు తిన్నవారు కూడా ఈ వ్యాధి బారిన పడతారు. అపరిశుభ్రమైన ఆవాసాల్లో ఉన్నవారికి, కుక్కలతో సాన్నిహిత్యం ఉన్నవారికి చర్మ వ్యాధులు సోకుతాయి.

**నివారణ ఇలా..**

వ్యాధులు సోకిన జంతువులు, కోళ్ల మాంసం, గుడ్లు సరిగా ఉడికించకుండా తినకూడదు. పాడైన, అపరిశుభ్రంగా ఉన్న పాలు, మాంసం, గుడ్లను ఆహారంగా తీసుకోకూడదు. రేబిస్ సోకిన పశువుల పాలు తాగకూడదు. పాడి పశువులు, జంతువుల పాకలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచాలి. పశువులు, జంతువులు, పక్షులు, కోళ్లకు కాలానికి అనుగుణంగా రోగ నిరోధక టీకాలు వేయించాలి. చనిపోయిన పశువులు, జంతువులను దూరప్రాంతాల్లో లోతైన గోతిలో సున్నం చల్లి పూడ్చి పెట్టాలి.

**తప్పనిసరిగా టీకాలు వేయిస్తాను**



ఆరేళ్లుగా లాబ్రడార్ కుక్కను పెంచుతున్నాం. మా కుటుంబ సభ్యుల్లో ఒకరిగా ప్రేమగా చూసుకుంటాం. శుభ్రత, తిండి విషయంలో జాగ్రత్తలు తీసుకుంటాం. వ్యాధులు రాకుండా టీకాలు వేయిస్తున్నాం. ప్రతీ సంవత్సరం రేబిస్ నివారణ టీకాతో పాటు, సీజన్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ఇతర టీకాలు వేయిస్తాం.

– సాయికృష్ణ, మంచిర్యాల

**వారంపాటు టీకా వేస్తాం**



కుందేళ్లు, పక్షులు, పిల్లుల తోపాటు శునకాలను పెంచుకునే వారి సంఖ్య పెరిగింది. ప్రతీరోజు 80 నుంచి 100 మంది దాకా పెంపుడు కుక్కలకు టీకాలు వేయించేందుకు వస్తారు. జిల్లా కేంద్రంలోని పశువైద్యశాలలో ఏడాది పొడవునా శునకాలకు యాంటీ రేబిస్ టీకా వేస్తున్నాం. కుక్కలు, పిల్లుల పెంపకందారులు ప్రతీ ఆర్నెళ్లకోసారి తమ పెంపుడు జంతువులకు టీకా తప్పనిసరిగా వేయించాలి. శనివారం నుంచి వారంపాటు వైద్యశాలలో పెంపుడు జంతువులకు టీకా వేస్తాం.

– గోపి కిషన్, సహాయ సంచాలకుడు, ఆదిలాబాద్ జిల్లా పశు వైద్యశాల

**అప్రమత్తత అవసరం**



జంతువుల ద్వారా బ్యాక్టీరియా, వైరస్‌లు వ్యాప్తి చెంది మనుషులకు సోకుతాయి. చర్మ సంబంధిత, శ్వాసకోశ, పేగు సంబంధిత వ్యాధులతో పాటు ప్రమాదకరమైన రేబిస్ సోకే ప్రమాదముంది. పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి. పిచ్చికుక్క మనుషులను ఛాతిపై భాగంలో ఎక్కడ కాటు వేసినా అత్యంత ప్రమాదకరం. కుక్కలను పెంచుకునేవారు ఆర్నెళ్లకోసారి రేబిస్ నివారణ టీకా వేయించాలి.

– రామారావు, ఆదిలాబాద్ జిల్లా సహాయ పశుసంవర్ధకశాఖ అధికారి

**తగిన జాగ్రత్తలు తీసుకోవాలి**



పెంపుడు జంతువులతో జాగ్రత్తగా ఉండాలి. ప్రధానంగా కుక్కలను దవాఖానాకు తీసుకువచ్చి టీకాలు ఇప్పించాలి. తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే పెంపుడు జంతువుల ద్వారా వ్యాధులు సంక్రమించే ప్రమాదముంది. ప్రతి ఒక్కరూ జీవాలపై కరుణ కలిగి ఉండాలి. అదే సమయంలో తగిన జాగ్రత్తలూ తీసుకోవాలి.

– ప్రియాంక, పశువైద్య నిపుణులు, నిర్మల్

**వ్యాధులు రాకుండా చూస్తా**



మా వ్యవసాయ క్షేత్రంలో ఆవులు, గేదెలు పెంచుతున్నాను. వాటి ఆరోగ్యం విషయంలో శ్రద్ధ చూపిస్తాను. అవసరమైతే పశువైద్యులను సంప్రదించి ఇంజక్షన్లు, టీకాలు వేయిస్తాను. ఏమాత్రం అనారోగ్యంగా ఉన్నా వైద్యం చేయిస్తాను. పశువులను పూర్తి ఆరోగ్యంగా ఉంచేందుకు ప్రయత్నిస్తాను.

– మనోహర్‌రెడ్డి, రైతు, చింబోలి (బీ)

**వ్యాక్సినేషన్ అవసరమే..**



నేను రిటైర్డయ్యాక మా వ్యవసాయ క్షేత్రంలో పశువుల తోపాటు కుక్కనూ పెంచుతున్నాను. ప్రతీరోజు పశువులకు మేత, కుక్కకు మంచి ఆహారం అందిస్తున్నాను. వాటి ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటిస్తాను. వాటికి అత్యంత సన్నిహితంగా ఉంటాను కాబట్టి ఇంజక్షన్లు, టీకాలు కూడా వేయిస్తుంటాను. – సంపత్‌కుమార్, రిటైర్డ్ ఉద్యోగి, నిర్మల్

**వైద్యుల సలహాలు పాటిస్తా**



నేను పదేళ్లుగా కుక్కలు పెంచుకుంటున్నాను. వాటిని జాగ్రత్తగా చూసుకుంటున్నాను. సమయానికి కావాల్సిన ఆహారం, నీరు అందిస్తాను. ఆరు నెలలకోసారి ఆస్పత్రికి తీసుకెళ్లి ఇంజక్షన్లు వేయిస్తాను. వాటితో ఎలాంటి అంటువ్యాధులు సోకకుండా తప్పకుండా వైద్యుల సలహాలు పాటిస్తాను. – మంథెన సంతోష్, ఆసిఫాబాద్

## నంబర్ ప్లేట్ తొలగిస్తే చీటింగ్ కేసు

- భైంసాలో ఒకరిపై నమోదు



నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనం

భైంసాటౌన్: నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపితే చీటింగ్ కేసు నమోదు చేస్తామని పట్టణ సీఐ డి.రాజారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని పూలేనగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా వాహన తనిఖీ చేపట్టారు. మహగాం గ్రామానికి చెందిన బాదావత్ సతీశ్ ఉద్దేశపూర్వకంగా నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడుపుతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు బైక్‌ను స్వాధీనం చేసుకుని, వాహన యజమానిపై భారతీయ న్యాయ సంహిత ప్రకారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



చుక్కల దుప్పి కళేబరం

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి గ్రా మంలో కుక్కల దాడిలో శుక్రవారం చుక్కల దుప్పి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. మధ్యాహ్నం సుమారు 3గంటల ప్రాంతంలో కుక్కలు అటవీ ప్రాంతం నుంచి దుప్పిని తరుముకుంటూ గ్రామ సమీపంలోని పంట చేలల్లోకి వచ్చాయి. గమనించిన రైతులు దుప్పిని కాపాడటానికి ప్ర యత్నించినా అది తీవ్ర గాయాలతో మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన సమాచా రంతో అక్కడికి చేరుకున్న బీట్ అధికారులు అమరేందర్, మహేశ్ పంచనామా నిర్వహించి దుప్పి కళేబరాన్ని దహనం చేశారు. వన్యప్రాణుల సంరక్షణకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

### గుట్కా పట్టివేత



పట్టుకున్న గుట్కా ప్యాకెట్లతో పోలీసులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని గాంధీచౌక్ సమీపంలోగల ఓ నివాసంలో శుక్రవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ అధికా రులు తనిఖీలు నిర్వహించి గుట్కా ప్యాకె ట్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకా రం.. పట్టణానికి చెందిన విజయ్ తహలా ని ఇంటిలో అక్రమంగా నిల్వ చేసి అమ్మకానికి సిద్ధం చేసిన రూ.38,040 విలువైన గుట్కా ప్యాకెట్లు పట్టుకున్నారు. అనంత రం కాగజ్‌నగర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అ ప్పగించారు. ఈమేరకు విజయ తహలా నిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపా రు. తనిఖీల్లో ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది మధు, రమేశ్ తదితరులున్నారు.

### దొంగల పట్టివేత

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ ప్రాంతంలో ఓ ఇంట్లో దొంగతనానికి యత్నించిన ఇద్దరిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇంటి రెండో అంతస్తులో శుక్రవారం రాత్రి తలుపులు మూసి ఉండటంతో లోపలికి చొరబడి దొంగలు బీరువా తెరిచేందుకు ప్రయత్నించారు. చప్పుడు కావడంతో కింద ఉన్నవారు పైకి వచ్చి దొంగలను పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు దొంగలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

### ట్రిపుల్ ఐటీలో ఎన్‌సీసీ, క్యాప్ విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్



పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

బాసర: బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశాల కోసం ఎన్‌సీసీ, క్యాప్(చైల్డ్ ఆరమ్డ్ పర్సన్) కోటా విద్యార్థుల సర్టిఫికెట్లను శుక్రవారం అధికారులు వెరిఫికేషన్ చేశారు. ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని జాయింట్ కన్వీనర్ డాక్టర్ పావని పర్యవేక్షించారు. 8వ తేదీ నుంచి జరిగే మొదటి దశ కౌన్సెలింగ్‌కు ఎంపికైన విద్యార్థులకు కాల్ లెటర్స్ పంపినట్లు తెలిపారు. కాల్ లెటర్‌లో పేర్కొన్న విధంగా విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ దత్తు, రాకేశ్‌రెడ్డి, హరికృష్ణ, దస్తగిరి, అడ్మిషన్ టీం సభ్యులు పాల్గొన్నారు.

### మృతదేహం లభ్యం



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై విజయ్

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలం కెలికే గ్రామ సమీపంలోని కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న వరద నీటిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. జైనూర్ మండలం జామ్ని గ్రామానికి చెందిన జాదవ్ ప్రకాశ్ కెరమెరి మండలం లేండిగూడ నుంచి జైనూర్‌కు బైక్‌పై వెళ్తున్న క్రమంలో అదుపు తప్పి కల్వర్టు కింద పడ్డాడు. నీటి ప్రవాహంలో ఖైరీ వాగు దాకా సుమారు నాలుగు కిలో మీటర్ల వరకు కొట్టుకుపోయాడు. శుక్రవారం కొందరు చె ట్టుకు తట్టుకుని ఉన్న మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహం అప్పగించారు. మృతుడి బావ జాదవ్ శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై విజయ్ తెలిపారు.

## రోడ్డెక్కిన ఆదివాసీలు

- రహదారి నిర్మించాలని డిమాండ్
- భారీ వర్షంలోనూ రాస్తారోకో
- తహసీల్దార్ హామీతో విరమణ



భారీ వర్షంలోనూ రాస్తారోకోలో పాల్గొన్న ఆదివాసీలు

నార్నూర్: గిరి గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజనులు శుక్రవారం ఆందోళనకు దిగారు. గాదిగూడ మండల కేంద్రంలోని కుమురంభీం చౌక్ వద్ద భారీ వర్షంలోనూ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సుమారు రెండు గంటల పాటు చేపట్టిన రాస్తారోకోతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కలెక్టర్ వచ్చి హామీ ఇవ్వాలని వారు పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ విజయనందం అక్కడికి చేరుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్ మాట్లాడుతూ.. గాదిగూడ మండలంలోని 12 గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో గిరిపుత్రులకు ఏటా తిప్పలు తప్పడం లేదన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చొరవ తీసుకుని రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సరిపడా వైద్య సిబ్బందిని నియమించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శంభు, లింగు, సంతోష్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాలను బలోపేతం చేయాలి



సుంకిడిలోని సూపర్‌మార్కెట్‌ను పరిశీలిస్తున్న జీఎం

తలమడుగు: సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని నాబార్డ్ జీఎం ఉషారాణి సూచించారు. శుక్రవారం మండలంలోని సుంకిడి గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్‌ను పరిశీలించారు. లాభాల బాటలో సూపర్ మార్కెట్ నడుస్తుందని జీఎంకు సహకార సంఘ చైర్మన్ దామోదర్‌రెడ్డి వివరించారు. ఏడు గ్రామాల రైతులకు ఎరువులు విక్రయిస్తున్నట్లు చెప్పారు. బరంపూర్ గ్రామంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతేడాది సంఘం ద్వారా సుమారు రూ.4కోట్ల ఎరువులు విక్రయించినట్లు తెలిపారు. దీంతో జీఎం చైర్మన్, సిబ్బందిని అభినందించారు. అనంతరం జీఎం ఉషారాణి మాట్లాడుతూ.. నాబార్డ్ ఆధ్వర్యంలో పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సూపర్ మార్కెట్‌కు సరుకులు రవాణా చేసే ట్రక్కును ప్రారంభించారు. నాబార్డ్ ట్రైనింగ్ మేనేజర్ మనోజ్, ఏడీసీసీ జీఎం సూర్యప్రకాశ్, సీఈవో, శ్రీనివాస్ తదితరులున్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా ఎస్జీటీల బదిలీ

- ఎస్టీయూ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్

నిర్మల్ రూరల్: జిల్లాలో ఇటీవల జరిగిన ఎస్జీటీ ఉపాధ్యాయ బదిలీల్లో కొన్నిచోట్ల నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేశారని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ ఆరోపించారు. జిల్లాలో కొందరు ఎంఈవోలు బదిలీ అయిన ఉపాధ్యాయులను నిబంధనలకు విరుద్ధంగా రిలీవ్ చేశారని పేర్కొన్నారు. ముధోల్, కడెం, నిర్మల్ రూరల్ తదితర మండలాల అధికారుల తప్పిదంతో పదుల సంఖ్యలో నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు జరిగాయని వివరించారు. కొత్త పాఠశాలల్లో జాయిన్ అయిన ఉపాధ్యాయులు తిరిగి పాత పాఠశాలలకే రావాలని మొబైల్ ద్వారా సమాచారం ఇస్తున్నారని తెలిపారు. అధికారులు చేసిన తప్పులకు ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కొందరు ఎంఈవోలు బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయుల మానసిక ఆందోళనకు కారణమైన ఎంఈవోలపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ చేతన స్వచ్ఛంద సంస్థ కాగజ్‌నగర్ T.I ప్రాజెక్టులో కాగజ్‌నగర్, సిర్పూర్, కౌటాల, బెజ్జూర్, దహేగాం, భీమిని, నెన్నెల, రెబ్బెన, ఐ.బి తాండూర్, తిర్యాణి, బెల్లంపల్లి ఏరియాలలో పనిచేయుటకు ఔట్ రీచ్ వర్కర్లు కావలెను. అర్హత: ఇంటర్ లేదా 10th. ప్రాజెక్ట్ మేనేజర్ అర్హత: MSW లేదా M.A Sociology, M&E డేటా మేనేజర్ అర్హత: డిగ్రీ, స్టాఫ్ నర్స్ అర్హత: G.N.M లేదా B.Sc. నర్సింగ్ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత H.I.V ఫీల్డ్‌లో 9182072652, 8341868021. chetanamtl@gmail.com [K-1246854]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185240]

www.sakshi.com

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుటకు ఇంటి పని/వంట పని చేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663 [H-799899]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,